క్లుప్తంగా

31లోపు పన్ను చెల్లించండి

గుడివాడ టౌన్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఈ నెల 31వ తేదీతో ముగియనున్నందున పురపాలక సంఘ పరిధిలోని భూ యజమానులు ఆస్తి, కుళాయి, ఖాళీ స్థలాల పన్ను వెంటనే చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ బి. శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల ప్రయోజనం దృష్టిలో ఉంచుకుని ఆదివారం కూడా పురపాలక సంఘ కార్యాలయంలో పన్ను చెల్లించేందుకు కౌంటర్లు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

5న మెగా జాబ్‌మేళా

గుడివాడ టౌన్: స్థానిక అక్కినేని నాగేశ్వరరావు కళాశాల్లో దివిస్ లేబొరేటరీస్ హైదరాబాద్ వారిచే ఈ నెల ఐదో తేదీన మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పీజే ఎస్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాకు 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ వారికి ట్రైనీ హెల్పర్లు, బీఎస్సీ కెమిస్ట్రీ, బి-ఫార్మసీ, బీటెక్ కెమికల్, మెకానికల్ ఇంజినీర్లకు ట్రైనీ సూపర్‌వైజర్‌లుగా, ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఎనలైటికల్ కెమిస్ట్రీ, మైక్రోబయాలజీ, ఎం-ఫార్మసీ వారికి గ్రాడ్యుయేట్ అప్రెంటీస్ ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. 21 నుంచి 25 సంవత్సరాలు లోపుగల యువతీ యువకులు అర్హులని తెలిపారు. జాబ్ మేళాకు వచ్చేవారు బయోడేటా, ఆధార్, ఒరిజినల్ సర్టిఫికెట్లు జిరాక్స్ కాపీలు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో హాజరు కావాలని ఆయన కోరారు.

పశువులకు వ్యాధి నివారణ టీకాలు వేయించండి

గుడ్లవల్లేరు: గాలికుంటు, బ్రూసెల్లోసిస్ వ్యాధుల నివారణ టీకాలను పశువులకు పాడి రైతులు వేయించాలని వెటర్నరీ వైద్యాధికారి డాక్టర్ రత్న వీణ పేర్కొన్నారు. ఆ వ్యాధుల నివారణకు శనివారం ఆమె వడ్లమన్నాడులో పశువులకు నివారణ టీకాలను వేశారు. నాలుగు నెలల దూడ నుంచి పెయ్య దూడ, దున్న పిల్ల అనే తేడా లేకుండా పాడి గేదెలు, ఆవులు అన్నింటికీ గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలన్నారు.

ఓపెన్ హౌస్‌పై అవగాహన




గుడ్లవల్లేరు: ఓపెన్ హౌస్‌పై విద్యార్థినులకు అవగాహన కార్యక్రమాన్ని గుడ్లవల్లేరు పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ ఎన్.వి.వి.సత్యనారాయణ నిర్వహించారు. స్థానిక ఎస్ఈఆర్ఎం హైస్కూల్లో శనివారం ఆయన విద్యార్థినులకు ఈ కార్యక్రమంపై అవగాహనను చేపట్టి పోలీస్‌స్టేషన్‌లో విధులు, ఆయుధాలను గురించి వివరించారు. హెచ్ఎం రమణ పాల్గొన్నారు.

సైన్స్ క్విజ్ పోటీల్లో జస్వంత్ ప్రతిభ

మండవల్లి: ఏలూరు జిల్లాలో సైన్స్ క్విజ్ పోటీల్లో ఇంగిలిపాకలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి పైలా జస్వంత్ 7వ తరగతి విద్యార్థి జూనియర్స్ విభాగంలో ద్వితీయ స్థానం సాధించి మెడల్, రూ.2వేలు నగదు అందుకున్నాడు. ఇంగిలిపాకలంక హైస్కూల్లో సైన్స్‌డే పురస్కరించుకుని నిర్వహించిన సైన్స్ క్విజ్ పోటీల్లో ప్రథమస్థానం సాధించాడు. హెచ్ఎం శాంతకుమారి, ఉపాధ్యాయుడు జస్వంత్‌ను శనివారం అభినందించారు.

సేవా కార్యక్రమాలకు రూ.40 వేల విరాళం



కొండిపర్రు(పామర్రు): పామర్రు మండల రెడ్డీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాలకు స్పందించిన కొండిపర్రు గ్రామానికి చెందిన అమెరికాలో ఉంటున్న డాక్టరు గుజవర్తి శ్రీరామకృష్ణారెడ్డి అసోసియేషన్‌కు రూ.40 వేలను విరాళంగా శనివారం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు బొమ్మారెడ్డి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఏటా విద్యార్థుల చదువుకు ఆర్థిక ప్రోత్సాహకంగా ఈ నగదుని వినియోగించాలని దాత కోరారని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, కోశాధికారి సుభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

భూ ఆధార్‌పై కౌలురైతుల్లో అలజడి



రైతుసేవా కేంద్రంలో భూ ఆధార్ నమోదు చేస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది (ఫైల్)

గుడివాడరూరల్: సొంత భూమి కలిగిన రైతులకే భూ ఆధార్‌ను అందజేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించడంతో ఆ దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. భవిష్యత్‌లో వ్యవసాయ సంక్షేమ పథకాలను పొందాలంటే విశిష్ట గుర్తింపు సంఖ్యను రైతులు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని వ్యవసాయశాఖ అధికారులు చెబుతుండటంతో కౌలు రైతుల్లో అలజడి మొదలైంది. భవిష్యత్‌లో తమకు సంక్షేమ పథకాలు అందని ద్రాక్షలా మిగులుతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సొంత భూములు కలిగిన రైతులకు మాత్రమే 11 అంకెల విశిష్ట సంఖ్య(భూ ఆధార్) అందజేయడం కౌలు రైతులకు నష్టం వాటిల్లుతుందని ఆందోళన చెందుతున్నారు. సాగుదారుల సంక్షేమం కోసం చేసిన చట్టాలు నిర్వీర్యం అవుతున్నాయన్న అనుమానం కౌలుదారుల్లో నెలకొంది. సొంత భూమి ఉన్న యజమానులకు 11 అంకెల విశిష్ట సంఖ్యతో భూఆధార్‌ను జారీ చేయాలని కేంద్రం ఆదేశించడంతో రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా నమోదు చేపడుతోంది. ప్రధాన మంత్రి కిసాన్ ఫసల్ భీమాతో పాటు బ్యాంకు రుణాలు, కిసాన్ క్రెడిట్ కార్డులు, ఇతర సంక్షేమ పథకాలకు ఈ విశిష్ట సంఖ్య తప్పనిసరి అని కేంద్రం పేర్కొంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న చట్టాలతో కౌలు రైతులకు జారీ చేసిన గుర్తింపు కార్డులు చెల్లుబాటు కావని రైతు సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.

విశిష్ట సంఖ్య నమోదుకు చర్యలు

భూ యజమానికి విశిష్ట సంఖ్య జారీ చేయాలని ఆదేశించడంతో వ్యవసాయశాఖ చర్యలు చేపట్టింది. రైతు సేవా కేంద్రాల్లోని సిబ్బంది వద్దకు భూ యజమాని ఆధార్, పట్టాదార్ పాస్‌పుస్తకం, ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ నంబర్‌ను తీసుకుని వెళ్తే వారు ఫార్మర్ రిజిస్ట్రీలో ఓనర్ షిప్‌ను నిర్ధారించి వారికి 11అంకెల నంబర్‌ను కేటాయిస్తున్నారు. వీటిలో సాంకేతిక సమస్యలు తలెత్తితే రెవెన్యూ అధికారులు రికార్డులు పరిశీలించి వారికి నంబర్‌ను కేటాయిస్తారు. కేంద్రం డిజిటల్ అగ్రి మిషన్ పేరుతో రైతుల వివరాలను డిజిటలైజేషన్ చేయాలని భావించడంతో చిన్న, సన్నకారు రైతులతో పాటు కౌలు రైతుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారనుంది. ఈ చర్య వల్ల కార్పొరేట్ శక్తులకు అండగా ఉండేందుకు పావులు కదుపుతోందని రైతు సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

అందని ద్రాక్షగా రుణాలు

భవిష్యత్‌లో భూ ఆధార్ ఉంటేనే బ్యాంకుల్లో రుణాలు మంజూరు చేయాలని ఆర్‌బీఐ బ్యాంకులకు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. గతంలో కౌలు రైతులకు పంట సాగుదారు హక్కు పత్రాలు ఉంటేనే బ్యాంకులు అరకొరగా రుణాలు అందజేసేవారు. ప్రస్తుతం ఆర్‌బీఐ జారీ చేసిన ఆదేశాలతో కౌలు రైతులకు రుణాలు అందని ద్రాక్షలా మారనున్నాయి. కూటమి ప్రభుత్వం కౌలు రైతులకు మేలు చేసేలా చట్టం తీసుకొస్తామని పేర్కొనడంతో వారు ఆశగా ఎదురు చూస్తున్నారు.

కౌలు రైతులకు అందజేయాలి



భూ ఆధార్‌తో కలిగే ప్రయోజనాలు కౌలు రైతులకు కూడా అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. భూ ఆధార్‌తో కౌలు రైతుల గుర్తింపునకు ఆటంకం ఏర్పడనుంది. పంటల సాగులో కౌలు రైతుల కష్టాన్ని ప్రభుత్వాలు గుర్తించి తమకు మేలు చేసి ఆదుకోవాలి.

– శ్రీనివాసరావు,
కౌలురైతు, తటివర్రు

తీరని నష్టం



పంట సాగు చేసే వారిలో దాదాపు 60 శాతానికి పైగా కౌలు రైతులే. భూ ఆధార్‌ను యజమానులకు జారీ చేసి కౌలు రైతులకు తీరని నష్టం చేసేలా ప్రభుత్వాలు పన్నాగం పన్నాయి. గతంలో కౌలు రైతులకు కార్డులు ఉండేవి. ప్రస్తుతం కౌలు రైతుల ఊసే లేదు. డిజిటల్ అగ్రి మిషన్‌ను రాష్ట్రంలో అమలు చేయడం సరికాదు. ఈ ప్రక్రియతో కౌలు రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

–నీలం మురళీకృష్ణారెడ్డి,
రైతు సంఘం నాయకుడు

ఆదేశాలు రాలేదు



కౌలు రైతులకు సంబంధించి భూ ఆధార్ జారీపై ఇప్పటి వరకు ఎటువంటి ఆదేశాలు రాలేదు. త్వరలో వారికి కూడా నంబర్ కేటాయించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. ఆదేశాలు రాగానే అందజేస్తాం. ప్రస్తుతం యజమానులకు పూర్తి కాగానే తర్వాత కౌలురైతులకు నంబరు కేటాయించే అవకాశం ఉంది. మండలంలో 4,500 మంది సొంత భూములు కలిగిన రైతులు ఉన్నారు. ఇప్పటికే 60 శాతం పైగా పూర్తయ్యాయి. మిగిలిన వారికి కూడా వీలైనంత త్వరగా నంబరు కేటాయిస్తాం.

–బి.అనంతలక్ష్మి, మండల వ్యవసాయశాఖ అధికారి

ఇంటర్ పరీక్షలు ప్రారంభం



పరీక్షలు రాస్తున్న విద్యార్థులు



పామర్రులో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ ధీరజ్ వినీల్

గుడివాడ టౌన్: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. పట్టణంలోని పలు జూనియర్ కళాశాలల్లో ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు ఈ పరీక్షలు జరిగాయి. స్థానిక శ్రీ చైతన్య కళాశాల్లో 477 మంది, ఏఎన్నార్ కళాశాల్లో 485 మంది, కేటీఆర్ మహిళా కళాశాల్లో 416 మంది, ఆర్‌కే జూనియర్ కళాశాల్లో 285 మంది, నారాయణ జూనియర్ కళాశాలలో 355 మంది మొదటి సంవత్సరం పరీక్షలకు హాజరైనట్లు అధికారులు తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమవుతాయని అధికారులు తెలిపారు.

పరీక్ష కేంద్రం పరిశీలన

పామర్రు: పామర్రులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని గుడివాడ డీఎస్పీ వి.ధీరజ్ వినీల్ శనివారం తనిఖీ చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల పరిసరాల్లో బయట వ్యక్తులు గానీ, అనుమానాస్పద వ్యక్తులు గానీ ఉండరాదన్నారు. పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉందన్నారు. కార్యక్రమంలో పామర్రు ఎస్ఐ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

నందివాడలో..

నందివాడ: మండలంలోని రుద్రపాక ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో శనివారం నిర్వహించిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షకు 63 మంది హాజరయ్యారు. సోమవారం జరగనున్న ద్వితీయ సంవత్సర పరీక్షకు 66 మంది హాజరుకానున్నారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశామని ఆ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు.

ప్రశాంతంగా పరీక్షలు

పామర్రు: మండలంలో ఇంటర్మీడియట్ పరీక్షలు శనివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో 302 మందికి 295 మంది హాజయ్యారని పరీక్షల చీఫ్ వెంకటేశ్వరరావు తెలిపారు. నిమ్మకూరులో ఏపీ ఆర్‌జేసీ గురుకుల కళాశాల్లో 133 మందికి గాను 132 మంది పరీక్షకు హాజయ్యారని పరీక్షల చీఫ్ శాంభవి తెలిపారు.

కైకలూరులో..

కైకలూరు: మండలంలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రశాంత వాతావరణంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. కైకలూరు మండలంలో 5 కాలేజీలు, మండవల్లి మండలంలో రెండు కాలేజీలు కలిపి కైకలూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీ, విజ్ఞాన్ కాలేజీ సెంటర్లలో పరీక్షలు నిర్వహించారు. కలిదిండి మండలంలో మూడు కాలేజీలకు సంబంధించి కలిదిండి ప్రభుత్వ జూనియర్ కాలేజీ, ముదినేపల్లి మండలంలో మూడు కాలేజీలకు ముదినేపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీ సెంటర్లలో విద్యార్థులు పరీక్షలు రాశారు. మొత్తం నాలుగు పరీక్ష కేంద్రాల్లో మొదటి సంవత్సరానికి చెందిన 750 మంది పరీక్షలు రాశారు. కైకలూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో షహన అనే విద్యార్థిని స్వల్ప అస్వస్థతకు గురికావడంతో చివరి అర్ధగంట ముందు కుటుంబ సభ్యులు ఆమెను ఇంటికి తీసుకువెళ్లారు.

మొవ్వలో..

మొవ్వ: మొవ్వ క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో శనివారం మొదటి సంవత్సరం ఇంటర్ పరీక్షలకు 206 మంది హాజరైనట్లు సీఎస్ సుధాకర్, డీఓ గంగాధర్ తెలిపారు. ఈ పరీక్షలను ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులు సర్వారెడ్డి, సుబ్రహ్మణ్యం తనిఖీ చేశారు.



కైకలూరు జూనియర్ కాలేజీలో పరీక్ష రాసి వస్తున్న విద్యార్థులు

రంజాన్ నెలారంభ శుభాకాంక్షలు

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి అనిల్‌కుమార్



పామర్రు: రంజాన్ నెల ఆదివారం నుంచి ప్రారంభమవుతున్న సందర్భంగా ముస్లింలకు వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికారి ప్రతినిధి కైలే అనిల్‌కుమార్ శుభాకాంక్షలను తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మహ్మద్ ప్రవక్త ద్వారా దివ్య ఖురాన్ ఆవిర్భవించిన ఈ రంజాన్ మాసంలో నెల రోజుల పాటు నియమనిష్టలతో ముస్లింలు కఠిన ఉపవాస వ్రతం ఆచరించి అల్లాహ్ కృపకు పాత్రులవుతారన్నారు. మనిషిలోని చెడు భావాన్ని, అధర్మాన్ని, ద్వేషాన్ని రూపుమాపుతూ మానవాళికి హితాన్ని బోధించే పండుగ రంజాన్ అని పేర్కొన్నారు.

పేదలకు ప్రయోజనం లేని బడ్జెట్



విలేకరులతో మాట్లాడుతున్న ఆర్‌సీపీ రెడ్డి

గుడివాడ టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదలకు ఏ విధంగా ప్రయోజనం చేకూర్చదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్‌సీపీ రెడ్డి అన్నారు. సీపీఎం కార్యాలయంలో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలోనే రూ.2 లక్షల కోట్లు బడ్జెట్ ప్రవేశపెట్టగా ప్రస్తుత ప్రభుత్వం రూ.3,22,329 కోట్ల బడ్జెట్ ప్రవేశ పెట్టడం ఆర్భాటాలకు సూచన అని పేర్కొన్నారు. ఇది కార్పొరేట్‌లకు అనుకూలంగా ఉందన్నారు. సామాన్యులను విస్మరించి శతకోటీశ్వరులకు రాయితీలు ఇచ్చి సామాన్యులపై పన్ను భారం పడేవిధంగా ఈ బడ్జెట్ ఉందని తెలిపారు. రానున్న కాలంలో ప్రజలను సమీకరించి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు ఎండగడుతూ పెద్ద ఎత్తున పోరాటం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. సీపీఎం నాయకుడు లంకా సురేంద్ర పాల్గొన్నారు.

కౌలు రైతులకు మొండి చేయి



శీలం నారాయణరావు

మొవ్వ: రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్లో కౌలు రైతులకు మొండిచేయి చూపిందని ఆ సంఘ కృష్ణా జిల్లా సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు పేర్కొన్నారు. ఎన్నికల ముందు రాష్ట్రంలో కౌలు రైతులు ఆదుకుంటానని, వారికి అనుకూలంగా చట్టం చేస్తానని చిలక పలుకులు పలికి గద్దెనెక్కిన పాలకులు వారిపట్ల కనీసం జాలి చూపడం లేదన్నారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లో కౌలు రైతులకు అనుకూలంగా చట్టం రూపొందించాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలి

డీఈఓ విజయరామారావు



ప్రోత్సాహక బహుమతులను అందజేస్తున్న డీఈఓ

మొవ్వ: పాఠశాలకు ప్రభుత్వంతో పాటు దాతలు సమకూర్చిన వసతులు సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలని కృష్ణా జిల్లా విద్యాశాఖ అధికారి పి విజయరామారావు సూచించారు. స్థానిక మండవ కనకయ్య జిల్లా పరిషత్ హైస్కూల్ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఈఓ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుతోపాటు క్రీడల్లో, సాంస్కృతిక కార్యక్రమాల్లో రాణించాలన్నారు. అనంతరం విద్యా, క్రీడల పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. పాఠశాల హెచ్ఎం సూర్యదేవర శ్రీదేవి అధ్యక్షతన కొనసాగిన ఈ కార్యక్రమంలో ఉప విద్యాశాఖ అధికారి(ఉయ్యూరు) పద్మారాణి, మండల విద్యాశాఖ అధికారులు శివశంకరరావు, శ్రీలక్ష్మి, ఎస్ఆర్ఐ శేషగిరి రావు, విశ్రాంత హెచ్ఎం మండవ నీలవేణి, స్కూలు విద్యా కమిటీ చైర్మన్ బాబురావు పాల్గొన్నారు.

సెంట్రల్ జోన్ కబడ్డీలో బాలికల ప్రతిభ



మండవల్లి: సెంట్రల్ జోన్ బాలికల కబడ్డీ పోటీల్లో లోకుమూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ద్వితీయస్థానంలో నిలిచారు. జిల్లాస్థాయిలో ఏలూరు అశోక్‌నగర్‌లోని కేపీడీటీ హైస్కూల్లో ఈ పోటీలు నిర్వహించారు. విజేతలను శనివారం పీఈటీ వేణు మాస్టర్‌ను హెచ్ఎం వెంకటేశ్వరరావు అభినందించారు.

పాఠశాలకు వాటర్ కూలర్ వితరణ

కైకలూరు: గ్రామ పాఠశాలకు దాతల సాయం అభినందనీయమని వేమవరప్పాడు ఎంపీయూపీ ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం చిట్టూరి చంద్రశేఖర్ పేర్కొన్నారు. గ్రామానికి చెందిన గంగుల గణపతి కుమారుడు పాండురంగారావు రూ.8వేల విలువ చేసే వాటర్ కూలర్‌ను వితరణగా శనివారం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ విశ్రాంత పంచాయతీ సెక్రటరీ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మరియమాత ఉత్సవాలు ప్రారంభం

కైకలూరు: కలిదిండి మరియమాత ఉత్సవాలు శనివారం విచారణకర్త బంటుమిల్లి యోహాను ప్రారంభించారు. ఈ నెల మూడో తేదీ వరకు ఈ ఉత్సవాలు కొనసాగుతాయి. ఫాదర్ జక్కుల ఫ్రాన్సిస్‌తో కలిసి ఆయన దివ్యపూజా బలి సమర్పించారు. అనంతరం మరియమాత స్వరూపాన్ని కలిదిండిలో ఊరేగించారు. మధ్యాహ్నం శృంగవృక్షంకు చెందిన విచారణ కర్త తోట గాబ్రియేలు క్రీస్తు సందేశాన్ని అందించారు. కైకలూరు విచారణకర్త గంటా ప్రవీణ్ ఆధ్వర్యంలో మధుర గీతాలు ఆలపించారు.

దుప్పట్ల పంపిణీ

గుడివాడ టౌన్: గాస్పెల్ ప్రేయర్ టెంపుల్ మినిస్ట్రీస్ సేవా కార్యక్రమాల్లో భాగంగా శనివారం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రోగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. చంటిపిల్లలకు నాణ్యమైన టవల్స్ అందజేశారు. గుడివాడ మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. డాక్టర్ పొట్లూరి వంశీకృష్ణ, డాక్టర్ మాగంటి శ్రీనివాస్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్. ఇందిరాదేవి, డాక్టర్ కృష్ణదొర, సజ్జా జీవన్‌రాణి పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ సి.ఎల్.వెంకట్రావు ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 348 మందికి వైద్య పరీక్షలు చేశారు. గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఆరోగ్య సమస్యలున్న వారికి డాక్టర్ సి.ఎల్.వెంకట్రావు, దంత సమస్యలకు ఏలూరు సెయింట్ జోసఫ్ డెంటల్ వైద్యులు, గుండె సంబంధ వ్యాధులకు విజయవాడ సీవీఆర్ మల్టీ స్పెషాల్టీ హాస్పిటల్ వైద్యులు తమ సేవలను అందించారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

వేంకటేశ్వరుడి సన్నిధిలో భక్తజన సందడి

గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తజన సందడి అధికంగా ఉంది. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరిగింది. కార్యక్రమాన్ని మెయిల్ ప్రతినిధి పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి దంపతులు ప్రారంభించారు. మెయిల్ ఎండీ వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి సాయంతో అన్నదానం జరిగిందని తెలిపారు. స్వామివారు సర్వ పుష్పాలంకరణతో దర్శనమిచ్చారు.

ఆర్ఎంపీ వైద్యశాల తనిఖీ

కైకలూరు: గోనెపాడు ఆర్ఎంపీ ఫణి నిబంధనలకు విరుద్ధంగా రోగులకు చికిత్స చేస్తున్నారని సోషల్ మీడియాలో వరుస కథనాలు శుక్ర, శనివారాల్లో హల్‌చల్ చేశాయి. దీంతో ఏలూరు డీఎంహెచ్ఓ మాలిని శనివారం విచారణ చేపట్టారు. నార్కోటిక్ పెయిన్ కిల్లర్ ట్రమడల్ ఇంజక్షన్లు వాడటం వల్ల ఇటీవల 35 ఏళ్ల వ్యక్తి మరణించాడంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. మృతి చెందిన వ్యక్తి కుటుంబాన్ని విచారణ చేయాలని కొల్లేటికోట పీహెచ్‌సీ డాక్టర్ కిరణ్‌ను ఉన్నతాధికారులు ఆదేశించారు. దీంతో గ్రామంలో సదరు కుటుంబాన్ని వైద్య సిబ్బంది విచారణ చేశారు. డీఎంహెచ్ఓ మాలిని, ఏలూరు నుంచి వచ్చిన డాక్టర్ రోహిత్ తదితరులు ఆర్ఎంపీ ఫణి ఆస్పత్రి వద్ద మెడికల్ దుకాణాన్ని తనిఖీ చేశారు. ప్రతిఒక్కరూ వైద్య ఆరోగ్య శాఖ నిబంధనలు పాటించాలని సూచించారన్నారు. అనంతరం శీతనపల్లి పీహెచ్‌సీని వారు సందర్శించారు.

రహదారి పనులకు మోక్షం


ముదినేపల్లి రూరల్: మండలంలో ప్రధానమైన వడాలి–తాడినాడ రోడ్డు మరమ్మతు పనులకు ఎట్టకేలకు మోక్షం లభించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సంక్రాంతి లోగా గోతులు లేని రోడ్లను నిర్మిస్తామని నాయకులు చెప్పారు. ఇటీవల వడాలి–తామరకొల్లు రహదారి మరమ్మతులు చేపట్టి, అభివృద్ధి చేసేందుకు పలు చోట్ల రోడ్డును తవ్వి వదిలివేశారు. రెండు నెలలుగా రహదారి పనులను పట్టించుకోకపోవడంతో వాహనదారులు తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. ఎట్టకేలకు ఈ రహదారికి మరమ్మతులు చేపట్టాలని ఆర్‌అండ్‌బీ అధికారులు ఆదేశాలివ్వడంతో పనులు ప్రారంభించారు. కాంట్రాక్టర్‌తో ఈ పనులను వెంటనే పూర్తిచేయించేలా చర్యలు తీసుకుంటామని ఆర్‌అండ్‌బీ ఏఈ అరవింద్ శనివారం తెలిపారు.

గోనె సంచుల అపహరణపై ఏడీఏ విచారణ



తోట్లవల్లూరు: నార్తువల్లూరు రైతు సేవాకేంద్రంలో గోనె సంచులు మాయం కావటంపై వ్యవసాయశాఖ పామర్రు ఏడీఏ స్వర్ణలత విచారణ నిర్వహించారు. స్థానిక రైతు సేవాకేంద్రాన్ని శనివారం ఆమె పరిశీలించారు. కార్యాలయ తాళం పగులకొట్టి 47 గోనె సంచులు అపహరించటంపై స్వర్ణలత సిబ్బంది నుంచి వివరాలు సేకరించారు. ఏఓ నాగేశ్వరరావు, ఉద్యానశాఖ అసిస్టెంట్ దీపిక పాల్గొన్నారు.

ఓరియంటల్ పాఠశాల వార్షికోత్సవం



కైకలూరు: విద్యార్థుల ఆటపాటలతో కైకలూరు జిల్లా పరిషత్ ఓరియంటల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల శనివారం సందడిగా జరిగింది. పదో తరగతి విద్యార్థులకు, పాఠశాలలోని ఇతర విద్యార్థులు ఘనంగా వీడ్కోలు పలికారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. చదువులో ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు బహుమతులు అందించారు. హెచ్ఎం ఏ.శ్రీకృష్ణ, ఎస్ఎంసీ వైస్ చైర్‌పర్సన్ సుమతి, ఉపాధ్యాయులు బొర్రా శ్యామ్‌సుందర్, జీవీ సత్యనారాయణ, అవధాని, సి.లావణ్య, ఎం.రత్నకుమారి, జే.వెంకటేశ్వరరావు, పీఈటీ శిరీషా పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం



ముదినేపల్లి రూరల్: పాఠశాల రుణం తీర్చుకునేందుకు గ్రామాభివృద్ధికి కృషి చేస్తామని పలువురు పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. మండలంలోని పెదపాలపర్రు జెడ్పీ హైస్కూల్ 1987 బ్యాచ్‌కి చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శనివారం నిర్వహించారు. పూర్వ విద్యార్థి బొప్పన నాగభూషణం మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలోని బొప్పన బాబూరావు ట్రస్ట్ ద్వారా గ్రామంలో అభివృద్ధి పనులకు సహాయసహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈదర సీతారామయ్య ఆధ్వర్యంలో పెద్దలతో సంప్రదించి గ్రామాభివృద్ధి పనులు చేపట్టేందుకు నిర్ణయించినట్లు పూర్వ విద్యార్థులు తెలిపారు.